# లోగుట్టు కథ

రచన :
శ్రీమతి పఠానేని శ్రీశైల భ్రమరాంబ.

ఆ ఊళ్లో దాసరయ్యగారి దాంపత్యం మార్జాల దాంపత్యమని ఊరందరికీ తెల్సు. వాళ్ళ యింట్లో ప్రతి నిత్యం ఏదో ఒక కురుక్షేత్రరణ రంగం జరుగుతూనే వుంటుంది. దాసరయ్య భార్య దమయంతి ధనవంతుల ఆడపడుచు. దురుసుతనంతో, బిరుసుదనంలో, మాటకారితనంలో ఆమెను మించినవాళ్ళు ఆ ఊళ్ళో ఎవరు లేరనుకోవచ్చు. దాసరయ్య తల్లి శంకరమ్మ. ఆవిడో తిక్క శంకరమ్మ. తను చెప్పినట్లే కోడలు వినాలని, అక్షరాలా ఆవిడ అడుగు జాడల్లో కోడలు నడవాలనీ సతనిత్యం పోరాడుతూ వుంటుంది. పోనీ జన్మ మధ్యలో ఇల్లు వదలి ఎక్కడికైనా వెళ్ళాలన్నా శంకరమ్మకి లేక లేక చారగా మిగిలిన సంతతి ఒక దాసరయ్యే. శంకరమ్మని పదిరోజులు అట్టే వుంచుకు ఆదరించే 'నా' అన్న బంధువులు కూడా ఎవరూ లేరనే చెప్పొచ్చు. దాసరయ్యకి ఆస్తిపాస్తులు లేకపోయినా ఆరుగురు సంతానం మాత్రం ఉన్నారు అత్తాకోడళ్ళు హోరు హోరుమంటూ దెబ్బలాడుకోకుండా వుండడానికైనా ఇంట్లోకి సరిపోయిన భత్యాలు కూడా పూర్తిగా తెచ్చియివ్వలేని చాలీచాలని సంపాదన దాసరయ్యది. ఊళ్ళో అందరినీ మంచిచేసుకు పిల్లలకి ప్రవేట్లు చెప్పి నలభై, ఎలిమెంటరీ స్కూలు జీతం అరవై నెలకో వంద అతి ప్రయాసమీద సంపాదించే టీచరు దాసరయ్య. రోజుకి ఏకొద్ది కాలమో ఇంట్లో వుండే దాసరయ్యకి ఆ ఉన్నంతసేపైనా విశ్రాంతి లేకుండా ఒకవైపు భార్య, మరొకవైపు తల్లి తమ తమ తగువులు తీర్చమని ఎవరికి వారే కాట్ల కుక్కల్లా వస్తారు. ఇద్దరికీ జవాబు చెప్పే శక్తిలేని దాసరయ్య చిట్ట చివరకు తల్లిని నాలుగు తిట్టి, భార్యని కొట్టి, పిల్లల్ని తన్ని, విశ్రాంతికోసం ఊరిచివరకుపోయి మానవ లోకానికి దూరంగా ఏ చేనుగట్టునో కూర్చుని తనలో తనే ఏడ్చుకుని ఇంటికి చేరుకుంటాడు. కాని మళ్ళీ మామూలే కొంపలో. దాసరయ్యకి స్కూలు వున్నంతసేపూ పిల్లల గొడవనైనా భరించగల్గుతున్నాడు కాని, ఇంట్లో సమరంలో మాత్రం వేగలేకపోతున్నాడు. ఏవిధంగానూ మనశ్శాంతిలేక అగ్ని గుండంలో నిల్చున్నట్లుగా కొంపలో భోజనం మాత్రం చేసి వెళ్ళిపోతూంటాడు దాసరయ్య.

ఇంట్లో అత్తాకోడళ్ళకి ఎప్పుడూ ఆరని అగ్నిహోత్రంలా యుద్ధం రేగుతూనే వుంటుంది. అత్తాకోడళ్ళిద్దరూ పోట్లాటల్లో ఒకర్నొకరు కొట్టుకోలేక తిట్లతోనే స్వస్తిచెప్పడానికి మనస్కరించక గిన్నెలు, చెంబులు, బిందెలు, తలుపులు, ద్వారబంధాలు అన్నింటికీ కూడా ఆ విసురు తగుల్తూనే వుంటుంది. ఇంక యింట్లో ముగ్గురు పెద్దవాళ్ళూ కల్సినప్పుడు బలవంతమైన దేశాలు కలహానికి తలపెడితే మధ్యనపడి నలిగిపోయే బడుగుదేశాల్లాగ ఆరుగురు పిల్లలమీద అధికారంవున్న ఆ ముగ్గురి క్రోధావేశాలకు పిల్లలు గురిఅయిపోతుంటారు. ఆ రేగిన కోపాల్లో రణభేరీలు పిల్లల చెంపలమీదనూ, వీపులమీదనూ మ్రోగుతూ వుంటాయి. పెద్దవాళ్లు ముగ్గురూ బాకా స్వరాలతో కేకలు రంకెలు వేస్తూంటే పిల్లలందరూ సన్నాయి వాయిద్యాలు, ఎప్పుడూ ఆ కొంపలో అల్లా హోరుహోరు మంటూనే వుంటుంది.

ఆ తుపాను వాళ్ళింట్లోనే ఆరిపోయినా ఊళ్లోవాళ్లకి కొంత విశ్రాంతిగా వుండునేమో? కాని అల్లా వదిలేసే ఘటాలుమాత్రంకాదు అత్తాకోడళ్ళు. ఇంట్లో యుద్ధం పూర్తికాకుండానే గాలి-వానలాగ అత్తగారు ఓ వీధికి, కోడలు మరో వీధికి రెంకెవేస్తూ బయల్దేరి, ఆరోజు సంగ్రామం ఎందుకు, ఎల్లా, ఏవిధంగా ప్రారంభమైందో; అది ఎంతదూరం వెళ్లిందో; అంతా వివరంగా ఖంగుమనే కంచు గొంతుకతో చెప్తూంటే; అప్రక్కింటి వాళ్ళు గాలిదుమారంలాంటి కోడలు వెళ్ళాక, హోరు హోరుమంటూ కళ్ళంట వర్షం కురిపిస్తూ వచ్చే అత్తగారి నోటిధాటికి తట్టుకునే శక్తి లేకనో; వినే సహనం ఇంక నశించిపోవడంచేతనో కాని ఎవరికివారే తలుపులు బంద్ చేసుకునేవారు.

వర్షపు జల్లుల్లావచ్చి తమ గోడు చెప్పుకుపోయే ఈ అత్తాకోడళ్ళకి తీర్పు తీర్చే మహోత్తములుకూడా కొందరు వున్నారు. అగ్నిహోత్రం ఆరిపోకుండా మరికొంచెం ఆర్కంపోసే మహానుభావుల సహాయంతో చిరకాలంనుంచీ వారింట్లో ఎప్పుడూ ఏదోఒక సమరం సాగుతూనే వుంటుంది.

దాసరయ్య యింట్లోకి హెడ్మాష్టరు ఒకరు కొత్తగా కాపురం వచ్చారు. ఇంకా ఆయనకి ఇల్లు ఎక్కడా దొరక్కపోవడంచేత కుటుంబంతో దాసరయ్య యింట్లోనే వున్నారు. హెడ్మాష్టరు కుటుంబం, భార్య, భర్త, ఒక కూతురు. ముగ్గురేవారు అసలు హెడ్మాష్టరుకి ఉద్యోగం లేకపోయినా ఇబ్బంది లేదు. పది కుటుంబాలని పోషించే ఆస్థి వుంది. పైగా బి. ఎ. చదువుకున్నవాడు. ఆదర్శ భావాలుగల పరోపకార పరాయణుడు, పొలం చూచుకుంటూ కాలక్షేపానికి ఉద్యోగం చేసుకోవచ్చునని వచ్చాడు హెడ్మాష్టరు.

సరిగ్గా వారం రోజులు ఆ యింట్లో వుండి, ఆ కుటుంబ పరిస్థితినంతా గ్రహించారు. ఆ దంపతులు. ఓ రోజున దాసరయ్యతో హెడ్మాష్టరు కొంతసేపు ఏదో రహస్యంగా చెప్పాడు. ఆ మాట కాస్తా దాసరయ్యవిని ఇంటికివెళ్ళి మెల్లిగా భార్యకు తల్లికి చెప్పాడు ఆ మరుక్షణంలోనే ఆ ముగ్గురి ముఖాలు వికశించాయి. ముగ్గురూ బహు శాంతమూర్తుల్లా కొంతసేపు మాట్లాడుకున్నారు.

ఆ మర్నాటినుంచీ మహా విచిత్రం ఏమంటే ఆ యింట్లోంచి గట్టిగా మాటలు కూడా విన్పించడంలేదు. హెడ్మాష్టరు భార్యకూడా ఇంకో ఇంట్లోకి వెడ్తామన్నా వద్దని అత్తా కోడలిద్దరూ ఏకీభవించి చెప్పి ఆ కుటుంబాన్ని తమ యింట్లో ప్రక్కవాటాలో వుండమని ధ్రువపర్చి చెప్పడంతో అందులోనే వున్నారు ప్రశాంతంగా-ఆ అత్తా కోడళ్ళ మధ్య ఐకమత్యం, ఆ భార్యాభర్తల్లో అన్యోన్యత అందరూ కల్సి నవ్వుతూ కలిసి మెలిసి వుండడం చూచినవారందరికీ ఆశ్చర్యంగా వుంది దీనికి కారణమేమిటో తెల్సుకోవాలని అందరికీ తాపత్రయంగానే వుంది. అయినా లోగుట్టు ఆ యింట్లో పెద్దవాళ్ళకి ముగ్గురికీ తప్ప ఇంకెవ్వరికి తెలీడంలేదు. ఇరుగు పొరుగులకేకాక ఊరివారందరికీ కూడా ఇది విడ్డూరంగానే వుంది.

సంపాదించేభారం దాసరయ్యది; సరుకులు తెప్పించే పూచీ దమయంతిది; సరిపెట్టి బాధ్యతగా వాడవలసిన విధి శంకరమ్మదీ అయింది. ఎవరి డ్యూటీ వాళ్ళు సక్రమంగా నిర్వర్తించుకుంటూంటే ఆ ప్రశాంతమైన వాతావరణంలో దాసరయ్య, ఆరుగురుపిల్లలు ఎంతో హాయిగా వున్నారని వేరే చెప్పక్కర్లేదనుకొంటా! దాసరయ్య మనస్సుకి, పిల్లల వీపులకి, చెంపలకి, అత్తా కోడళ్ళ నోటికి పూర్తిగా విశ్రాంతి లభించింది. మధ్యమధ్య కాస్త తీరిగ్గా వున్నప్పుడు. హెడ్మాష్టారి భార్య-అత్తా కోడళ్లు కల్సి పొలాలకేసి వెళ్ళి చూసివస్తూండేవారు.

ఆరోజు దాసరయ్య మెల్లిగా భార్యని పిలిచి 'దమయంతీ! మనవాడిని హైస్కూలు చదువుకోసం పంపించాలనుకొంటున్నా-ఇవ్వాళే వాడు తర్డుఫారం ఫ్యాసైనట్లు తెల్సింది' అన్నాడు.

చాలారోజులనుంచి దెబ్బలాట మానేసిన కారణంగా కొంచెం మనస్సులో పీకడంచేత కాస్త గట్టిగా 'ఎందుకొచ్చిన చదువు? ఈ చదివిందేదో చాలు; వీడికోసం మళ్ళ ఖర్చు, పొరుగూరిలో చదువు? నిండా పన్నెండేళ్ళు లేనివాడిని పొరుగూరు పంపడమేమిటి?' అంది కొంచెం గట్టిగా.

'ఊరుకోవే. గట్టిగా అరవకు హెడ్మాష్టారి భార్యకి విన్పిస్తుంది. మనింట్లో దెబ్బలాడుకుంటున్నామని తెలిస్తే వాళ్ళ పిల్లని మన పిల్లాడికిచ్చి పెళ్లిచెయ్యడానికి సందేహిస్తారు' అన్నాడు రహస్యం చెప్తూన్నట్లు.

'పోనీ చదువుకుంటే చదువుకోనివ్వవే-హెడ్మాష్టారు సైకిలు ఇస్తాడుట రోజూ మన పిల్లాడు వెళ్ళిరావడానికి, తన అల్లుడు, బి. ఎ. వరకూ చదువుకోవాలని సర్దా పడ్తున్నాడట. నీకొడుకు, బి. ఎ. చదివాడంటే ఆయన కూతుర్నిచ్చి పెళ్ళిచేస్తాడు...ఇంక ఆ ఆస్థి, పొలం, ధనం, అంతా మనకే...మిగతా పిల్లలు ఆపైన ఎంతో అభివృద్ధికి వచ్చేలా మనం చేసుకోవచ్చు' అంది శంకరమ్మ ఆనందంతో - కిక్కురుమనకుండా అత్తా కోడళ్ళిద్దరూ ఆనందంతో అంగీకరించారు. భవిష్యత్‌లో జరగబోయేది ఎల్లావున్నా ప్రస్తుతంలో తను తృప్తిగా సంతోషించాడు దాసరయ్య లోగుట్టుమాత్రం చెప్పకుండా.

